సాక్షి మంచిర్యాల

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



ఆస్పత్రిలో బాలింత మృతి

చెన్నూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో బాలింత సోమవారం మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన, రాస్తారోకో నిర్వహించారు. 8లో▸

'పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం'

మంచిర్యాలటౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని, ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.0 /20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

కొత్త పనులకే మోక్షం

- 'ఎస్‌డీఎఫ్'లో నూతన అభివృద్ధి పనులే..
- రూ.10కోట్లకు ఎమ్మెల్యేల ప్రతిపాదనలు
- నియోజకవర్గాల్లో అభివృద్ధిపై ఆశలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేసిన నిధులతో జిల్లాలో కొత్తగా అభివృద్ధి పనులకు మోక్షం కలుగనుంది. స్పెషల్ డెవలప్‌మెంటు ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. జిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో ఈ మేరకు అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యవేక్షణలో నిధుల వినియోగం, అభివృద్ధి జరగనుంది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలతోపాటు ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలోని జన్నారం మండలంలో అభివృద్ధికి సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. మౌలిక వసతులతోపాటు రోడ్లు, భవనాలు, ప్రజా అవసరాల కోసం ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. దీంతో నియోజకవర్గాల్లో అభివృద్ధికి తోడ్పడే అవకాశం ఉంది.

విద్య, తాగునీటికి ప్రాధాన్యత

వీటిలో రూ.2కోట్లు ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా కోసం రూ.కోటి ఖర్చు చేయాలి. రూ.50లక్షలు జిల్లా కలెక్టరేట్, ప్రభుత్వ ఆఫీసుల నిర్వహణ కోసం వెచ్చించాలి. మిగతా రూ.6.50కోట్లు రోడ్లు, పారిశుధ్యం, భవనాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన కోసం 'మన ఊరు–మన బడి' పథకం కింద గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టింది. ఈ పథకంలో జిల్లా నుంచి 248స్కూళ్లు ఎంపిక చేశారు. వీటిలో 245చోట్ల గ్రౌండింగ్ అయ్యాయి. వీటిలో 158 ప్రాథమిక, 31 ప్రాథమికోన్నత స్కూళ్లు ఎంపిక చేశారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రతీ మండలానికి కనీసం రెండు చొప్పున ఎంపిక చేసి పనులు పూర్తి చేయాలని భావించారు. వీటిలో 36స్కూళ్లలో 27 ప్రారంభం కాగా, మరో 12 ప్రారంభం చేయాలి. అయితే ఇప్పటికీ కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. విద్యార్థుల కోసం మరుగుదొడ్లు, వంటగదులు, ప్రహరీలు, అయితే ఇలాంటి పనులను స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద చేయడానికి అవకాశం లేదు. మన ఊరు–మన బడితోపాటు ఇతర ఏ స్కీంలోనూ మొదలు కాని పనులకు మాత్రమే ఈ నిధులు ఖర్చు చేస్తారు.

ఎమ్మెల్యేల ప్రతిపాదనలు..

నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపిస్తున్నారు. ఈ మేరకు నియోజకవర్గాల అభివృద్ధి కోసం తమ దృష్టిలోని పనులకు స్థానిక ఎమ్మెల్యేలు జిల్లా ప్రణాళిక శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు వచ్చాయి. బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలకు సంబంధించిన పనులు అనుమతుల కోసం కసరత్తు జరుగుతున్నాయి. ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులను ప్రణాళిక అధికారులు, ఆయా శాఖల అధికారులతో పరిశీలించనున్నారు. ఎక్కడైనా గతంలో చేపట్టిన పనులు ఉంటే తొలగించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు, పెండింగ్‌లో ఉన్న వాటికి కాకుండా పూర్తిగా కొత్తగా ప్రతిపాదనలు పంపాలి. గతంలో రోడ్లు, భవనం, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఏవైనా ఖర్చు చేసినా వాటిని ఆమోదించే అవకాశం లేదు. దీంతో ప్రతీ చోట పూర్తిగా కొత్త పనులకే ప్రతిపాదనలు పంపుతున్నారు. మరోవైపు పనులు పూర్తయ్యే వరకు ముందస్తుగా నిధులు మంజూరయ్యే అవకాశం లేకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు వస్తారా? అనే సందేహాలు ఉన్నాయి. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు పూర్తయితేనే ఈ పనులు మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

డీపీఆర్‌ఓగా శారద బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీఆర్‌ఓ

నస్పూర్: డీపీఆర్‌ఓగా జే.శారద సోమవారం డీపీఆర్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై మీడియా సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లాలని అన్నారు. కాగా, జే.శారద సిరిసిల్ల నుంచి ఇక్కడికి బదిలీపై రాగా ఇక్కడ విధులు నిర్వర్తించిన సంపత్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం–2024 పారదర్శకంగా జరిగిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ తుది ఓటరు జాబితా విడుదల చేశామని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగే విధంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఓటరు నమోదుకు 1జనవరి 2024 ప్రామాణికంగా తీసుకుని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా నూతనంగా నమోదైన ఓటర్ల జాబితా వివరాలను మరోసారి ధ్రువీకరించాలని తెలిపారు. సెక్టార్, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ప్రత్యేక నిఘా బృందాలకు శిక్షణ అందించి ఎన్నికలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో వి.రాములు, చెన్నూర్ ప్రత్యేక సబ్ కలెక్టర్ సిడాం దత్తు, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వి.రాములు, హరికృష్ణలతో కలిసి అర్జీలు స్వీకరించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల ఏర్పాటు, పట్టాపాస్‌బుక్ మంజూరు, ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు బిల్లులు మంజూరు చేయాలని తదితర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. దండేపల్లి మండలం తాళ్లపేటకు చెందిన దివ్యాంగుడు కే.రవీందర్ మూడు చక్రాల వాహనం మంజూరు చేయాలని కోరారు. నస్పూర్ మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణాల అనుమతులు, ఇంటినంబర్ల కేటాయింపులపై విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్, జిల్లా నాయకుడు వేముల కిరణ్ కోరారు. 57దరఖాస్తులు వచ్చాయని, క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఇంటి అనుమతుల మంజూరుపై విచారణ



మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఆర్డీ షాహిద్ మసూద్

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: 'బదిలీ వేళ అనుమతులు' శీర్షికన ఈ నెల 18న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నస్పూర్ మున్సిపాల్టీ పరిధిలో పలు ఇళ్ల నిర్మాణాల అనుమతుల విషయంలో అవకతవకలు జరిగిన వైనంపై కథనం ప్రచురితమైంది. వరంగల్ రీజినల్ డైరెక్టర్(మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) షాహిద్ మసూద్ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గత కమిషనర్ టి.రమేశ్ సెలవులో ఉండి వేరే చోటుకు బదిలీ ఉత్తర్వులు వెలువడిన తర్వాత ఈ నెల 14న తొమ్మిది ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారనే ఆరోపణలపై విచారణ జరిపారు. హాజరు రిజిష్టర్‌ను పరిశీలించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా విచారణాధికారి మాట్లాడుతూ పలు ఇళ్ల నిర్మాణాల అనుమతుల మంజూరులో అవకతవకల జరిగాయనే నేపథ్యంలో విచారణ చేపట్టానని తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సతీష్, ఆర్‌ఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర కోలాహలం



మంచిర్యాలలో నిలువెత్తు బంగారం తూకం వేస్తున్న భక్తులు

- మేడారానికి భక్తుల పయనం
- విద్యాసంస్థల్లో హాజరు పై ప్రభావం

మంచిర్యాలఅర్బన్: రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతర కోలాహలం మొదలైంది. ఈ నెల 21న తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ఘట్టం ఆవిష్కృతం కానుండగా జిల్లాలో ముందస్తు సందడి నెలకొంది. సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో ఇళ్లలో వనదేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. సింగరేణి కార్మిక క్షేత్రమైన శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, చెన్నూర్‌తోపాటు మంచిర్యాలలో తల్లులను కొలవటం ఆనవాయితీ. నిలువెత్తు బంగారం(బెల్లం) తల్లులకు సమర్పణకు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఇళ్ల వద్ద అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయడం, కోళ్లు బలి ఇచ్చి మొక్కులు సమర్పించుకుంటున్నారు. అనంతరం బంగారం పంచిపెడుతుండడంతో కార్మిక వాడల్లో భక్తిభావం పొంగిపోతోంది. జాతరకు ముందుగా వేములవాడ, కొండగట్టు దేవాలయాలను చుట్టి వచ్చారు. మేడారం మహాజాతరకు రద్దీ దృష్ట్యా కొందరు అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. బొగ్గు ఉత్పత్తిపై జాతర ప్రభావం పడకుండా సింగరేణి యాజమాన్యం స్థానికంగానే జాతర ఏర్పాట్లు చేస్తూ వస్తోంది. సీసీసీలో ముక్కిడి పోచమ్మ, ఆర్కే–1ఏ గని సమీపంలోని పాలవాగు ఒడ్డున అటవీ ప్రాంతంలో జాతర సాగుతుంది. మంచిర్యాల గోదావరి నది పరీవాహక ప్రాంతంలో ప్రతీసారి నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మంచిర్యాల గోదావరి నది తీరంలో ఈ నెల 21 నుంచి కన్నుల పండువగా నిర్వహించే జాతర పనులు ఓ వైపు సాగుతుండగా.. మరోవైపు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకుంటున్నారు.

బస్సుల రాకపోకలు షురూ..

ఆర్టీసీ మంచిర్యాల బస్‌స్టేషన్ నుంచి వారం రోజుల ముందుగానే ఒక ప్రత్యేక బస్సు నడిపిస్తోంది. ఈ నెల 18 నుంచి మేడారం జాతరకు బస్సులు ప్రారంభించింది. జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాల, శ్రీరాంపూర్, చెన్నూరు, మందమర్రి నుంచి ఆయా డిపోలకు చెందిన 365 బస్సుల ద్వారా గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. రెండేళ్ల తర్వాత వచ్చిన జాతర నేపథ్యంలో ఈసారి అంతకంటే ఎక్కువ ఆదాయం తీసుకువచ్చేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. జాతర నేపథ్యంలో అద్దె వాహనాలకు భలే డిమాండ్ నెలకొంది.

తేదీ	విద్యార్థుల సంఖ్య	హాజరైన విద్యార్థులు	గైర్హాజరు సంఖ్య
16	41784	21640	20144
17	41784	20143	21641
19	41784	19430	22354

విద్యాసంస్థలపై ప్రభావం..

సమ్మక్క–సారలమ్మ జాతర ప్రభావం విద్యాసంస్థలపైనా పడుతోంది. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు ముందుస్తుగా వెళ్తుండడంతో విద్యార్థుల హాజరు సంఖ్య తగ్గుతోంది. ఆయా పాఠశాలల యాజమాన్యాలతో తల్లిదండ్రులు నేరుగా వచ్చి అనుమతి తీసుకుంటున్నారు. జాతర ముగిసే వరకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది. మరోవైపు పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు జాతరకు వెళ్తుండడంతో ఉపాధ్యాయులు ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితి. గత మూడు రోజులుగా 708 సర్కారు పాఠశాలల్లో హాజరైన విద్యార్థుల సంఖ్య అంతంత మాత్రమే కనిపిస్తోంది. జాతర సమీపిస్తుండడంతో రోజు రోజుకు విద్యార్థుల హాజరు సంఖ్య మరింతగా పడిపోతోంది.

నజరానా అధికారులపై చర్యలేవి..?

- హోంగార్డులకు ట్రాఫిక్ విధుల కేటాయింపునకు వసూళ్ల దందా
- ఎవరనేది తేలినా మామూలుగానే తీసుకున్న అధికారులు

మంచిర్యాలక్రైం: ట్రాఫిక్ పోలీసు విభాగంలో హోంగార్డ్‌లకు విధుల కేటాయింపు విషయంలో అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయమై ఈ నెల ఒకటిన 'నజరానా ఇస్తేనే ట్రాఫిక్ డ్యూటీ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనం వారం రోజులపాటు పోలీసుశాఖలో చర్చనీయాంశమైంది. నిఘా వర్గాలు ఆరా తీసి సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక సైతం అందజేసినట్లు సమాచారం. బాధ్యులు ఎవరనేది తేలినా సదరు అధికారులపై విచారణ చేపట్టకపోవడం పోలీసు శాఖలో చర్చకు దారి తీసింది. అప్పటి రామగుండం సీపీ రెమా రాజేశ్వరి బదిలీపై వెళ్లడం, ఆ తర్వాత మల్టీజోన్ డీఐజీ తరుణ్‌జోషికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం తెలిసిందే. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. పైగా ఎవరు సమాచారం ఇచ్చారంటూ హోంగార్డులపై అధికారులు ఒత్తిడి చేసినట్లు సమాచారం. రామగుండం పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు హోంగార్డులకు ట్రాఫిక్ విధుల కేటాయింపులో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది ట్రాఫిక్ విభాగంలో చర్చ జరుగుతోంది.

ఏం జరుగుతోంది..!

పోలీసు కానిస్టేబుల్, హోంగార్డులు ఏ స్థాయి అధికారి అయినా ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వర్తిస్తే నెల వేతనంతోపాటు 30శాతం అదనంగా అలవెన్స్ ఇస్తారు. ఈ అలవెన్స్ కోసం ట్రాఫిక్ విధుల నిర్వహణకు ఆసక్తి చూపిస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఓ ఇద్దరు అధికారులు 'మామూలు'గా విధులు కేటాయిస్తున్నారు. ట్రాఫిక్ విధులు కేటాయించేందుకు ముందుగా రూ.10వేలు, ప్రతీ నెల రూ.వెయ్యి వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఆరు నెలల తర్వాత మళ్లీ కొనసాగాలనుకుంటే మరో రూ.10వేలు ముట్టజెప్పాల్సిందే లేదంటే మరొకరికి కేటాయిస్తారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంవీఐలు



నూతన ఎంవీఐలకు సిబ్బంది స్వాగతం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నూతనంగా నియామకమైన ముగ్గురు ఎంవీఐలు, ఒక ఏఎంవీఐ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కుమురంభీం ఆసిఫాబాద్ డీటీఓ కార్యాలయం నుంచి టి.సంతోష్‌కుమార్, రాజన్నసిరిసిల్ల జిల్లా డీటీఓ కార్యాలయం నుంచి ఏ.కిషోర్‌చంద్రరెడ్డి, కోరుట్ల ఆర్టీఓ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన సీహెచ్.రంజిత్ ఎంవీఐలుగా బాధ్యతలు చేపట్టారు. ముగ్గురు ఏఎంవీఐలకు గాను వచ్చిన ఒకే ఒక్క ఏఎంవీఐ షేక్ ఖాసిం సాహెబ్ కూడా బాధ్యతలు స్వీకరించారు.

స్వాగతం పలికిన కార్యాలయ సిబ్బంది..

బదిలీపై జిల్లా రవాణా శాఖా కార్యాలయానికి వచ్చిన ఎంవీఐతోపాటు ఏఎంవీఐలకు డీటీఓ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, జూనియర్ అసిస్టెంట్లు వనిత, లింగయ్య, మహేశ్, సబ్ ఆర్డినేట్ జయమ్మ పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సీఎండీతో కలిసి సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సిమ్‌టార్స్ సెంటర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో ఆర్డీఎస్డీఈ(ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ) సహకారంతో మొదటిసారిగా ఏర్పాటు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంటు ట్రైనింగ్ సెంటర్ సేవలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో కలిసి సెంటర్‌లో పలు కోర్సులపై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం యువతకు డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్, పా) శ్రీనివాస్, ఏరియా జీఎం మనోహర్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ఏరియా అధికారులు పాల్గొన్నారు.

మేడారం బస్సు ప్రారంభం

మందమర్రిరూరల్: మందమర్రి మార్కెట్ బస్టాండ్ నుంచి మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. మేడారం వద్ద ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారని, 15వ నంబర్ క్యూని మందమర్రి మార్కెట్‌కు కేటాయించారని తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలు సహించం

- రౌడీషీట్, పీడీ యాక్ట్ నమోదు చేస్తాం
- భూ కబ్జాదారులపై ఉక్కుపాదం
- రామగుండం సీపీ శ్రీనివాసులు



జాతర ప్రాంతంలో వివరాలు తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: కమిషనరేట్ పరిధిలో ఎంతటివారైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, రౌడీషీట్, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా సోమవారం మంచిర్యాలకు వచ్చిన ఆయన మంచిర్యాల పోలీసుస్టేషన్, ఏసీపీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీసుస్టేషన్, మహిళా పోలీసుస్టేషన్‌లను సందర్శించారు. నేర వివరాలు తెలిపే రూట్‌మ్యాప్, జిల్లా సరిహద్దుల మ్యాప్ పరిశీలించారు. ఏసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దోపిడీ దొంగలపై కఠినంగా వ్యవహరిస్తామని, భూకబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. గుడుంబా, గంజాయి, పేకాట, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏసీపీ ప్రకాష్, సీఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో సమ్మక్క జాతర

మంచిర్యాలక్రైం: ఈ నెల 21 నుంచి 24వరకు మంచిర్యాల గోదావరి తీరంలో సమ్మక్క జాతరను నిఘా నీడలో నిర్వహించనున్నట్లు సీపీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం జాతర ఏర్పాట్లను స్థానిక ఏసీపీ ప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. జాతర నిర్వాహకులు, పోలీస్ అధికారులను ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూం నుంచి పరిశీలిస్తామని అన్నారు. సీఐ రవీందర్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సైలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలి

మంచిర్యాలక్రైం: క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసి పోలీసు వ్యవస్థకు కీర్తి ప్రతిష్టలు తేవాలని సీపీ శ్రీనివాసులు అన్నారు. కొత్తగా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కమిషనరేట్ ప్రాంగణంలో సలహాలు, సూచనలు ఇచ్చారు. కమిషనరేట్ పరిధిలో నుంచి శిక్షణకు వెళ్తున్న 381మంది అభినందించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

లక్సెట్టిపేట/దండేపల్లి: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. లక్సెట్టిపేటలో బీజేపీ నాయకులు స్థానిక పాత బస్టాండ్ నుంచి శివాజీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం శివాజీ చేసిన కార్యక్రమాలు మరువలేనివని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజనీష్, కిషన్, రాజన్న, రమేష్‌చంద్, ప్రభాకర్, రవి, వేముల మధు, పాల్గొన్నారు. దండేపల్లిలో బీజేపీ నాయకులు, ఛత్రపతి అభిమానులు సోమవారం ఘనంగా జయంతి నిర్వహించారు.



లక్సెట్టిపేట: విగ్రహం వద్ద నినాదాలు

మేదరిపేట నుంచి లక్సెట్టిపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రికవరీ అస్త్రం

- కార్మికులపై ఎక్కుపెట్టిన యాజమాన్యం
- కనిష్టంగా రూ.500 నుంచి గరిష్టంగా రూ.50 వేల వరకు
- దాదాపు 300ల మంది గుర్తింపు



బెల్లంపల్లి: సింగరేణి కార్మికులపై యాజమాన్యం అండర్ గ్రౌండ్ అలవెన్స్ రికవరీ అస్త్రం ఎక్కుపెట్టింది. భూగర్భంలో దిగకుండా సర్ఫేస్‌లో విధులు నిర్వహించి అండర్ గ్రౌండ్ అలవెన్స్ పొందిన కార్మికుల వేతనాల్లోంచి రికవరీ చేయడానికి సిద్ధపడింది. ఇందుకు సంబంధించి గనుల వారీగా జాబితాను నోటీసు బోర్డుపై అంటించి చర్యలకు ఉపక్రమించడంతో బాధిత కార్మికులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం మందమర్రి ఏరియా కార్మిక వర్గాన్ని తీవ్ర కలవరపాటుకు గురిచేస్తోంది. కంపెనీ ప్రయోగించిన రికవరీ చర్యల వల్ల అవసరాల రీత్యా గని అధికారుల ఆదేశాలతో అండర్ గ్రౌండ్‌కు బదులు సర్ఫేస్‌లో విధులు నిర్వహించిన కార్మికులు నష్టపోయే అవకాశాలు ఉన్నట్లు కార్మిక వర్గంలో చర్చ జరుగుతోంది.

300 మంది పేర్లు వెల్లడి

ఏరియాలోని వివిధ గనుల్లో పని చేస్తున్న దాదాపు 300 మంది వరకు కార్మికులు గడిచిన కొంతకాలం సర్ఫేస్‌లో పనిచేసి అండర్ గ్రౌండ్ అలవెన్స్ పొందుతున్నట్లు గుర్తించారు. ఆ ప్రకారం సదరు కార్మికుల నుంచి అలవెన్స్ రికవరీకి ఆదేశాలు జారీ కావడం కలకలం రేపుతోంది. శాంతిఖని, కాసిపేట–1, కాసిపేట–2, కేకే–5, తదితర బొగ్గుగనుల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాల నుంచి కోత పెట్టనున్నట్లు సమాచారం. ఒక్కో కార్మికుడి నుంచి కనిష్టంగా రూ.500 నుంచి గరిష్టంగా రూ.50 వేలకు పైబడి రికవరీ కానున్నట్లు జాబితాలో పొందుపర్చారు.

అండర్ గ్రౌండ్..సర్ఫేస్ విభాగాల్లో విధులు

సింగరేణిలో అండర్ గ్రౌండ్ (భూగర్భం), సర్ఫేస్ (ఉపరితలం)లో కార్మికులు విధులు నిర్వహిస్తారు. కార్మికుల శ్రమతీరును బట్టి అలవెన్స్ చెల్లిస్తుంది. దీంతో జీతభత్యాల్లో తేడా ఉంటుంది. భూగర్భంలో దిగి ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించే కార్మికులకు విధిగా అండర్ గ్రౌండ్ అలవెన్స్ వర్తింప జేస్తుంది. మస్టర్ల చొప్పున లెక్కకట్టి వేతనాల్లో కలిపి ఇస్తుంది. అందుకే సర్ఫేస్ కార్మికుల కన్నా అండర్ గ్రౌండ్ కార్మికుల వేతనాలు రూ.వేలల్లో వ్యత్యాసం కనిపిస్తుంది.

రిజిష్టర్‌లో పొందుపర్చకుండా కార్మికులకు అన్యాయం

గనుల్లో కార్మికులతో అవసరాలకు అనుగుణంగా అధికారులు పనులు చేయించుకోవడం జరుగుతుంది. అండర్ గ్రౌండ్ కార్మికులతో సర్ఫేస్ పనులు చేయించుకోవడం సర్వసాధారణంగా జరుగుతుంది. ముఖ్యంగా మెటీరియల్‌ను భూగర్భంలో దింపేందుకు, ఇతర అవసరాలకు గని అధికారులు, సూపర్ వైజర్లు అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహించే కార్మికులకు సర్ఫేస్‌లో పనులు కేటాయించి పూర్తిచేస్తారు. ఆతీరుగా పనులు చేసిన అండర్ గ్రౌండ్ కార్మికులను అవసరాల కోసం సర్ఫేస్‌లో ఉంచి పనులు చేయించినట్లు నిర్దేశించిన రిజిష్టర్‌లో విధిగా పొందుపర్చాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించి అండర్ గ్రౌండ్ అలవెన్స్ చెల్లించడంతో సదరు కార్మికులు దోషులుగా నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని సహచర కార్మికులు పేర్కొంటున్నారు. కంపెనీ అవసరాలకు కార్మికులను ఉపరితలంలో వినియోగించుకుని తీరా అక్రమ పద్ధతిలో అలవెన్స్ పొందారని రికవరీకి సిద్ధపడటాన్ని తప్పుపడుతున్నారు. కొందరు కార్మిక సంఘాల నాయకులు మస్టర్‌పడి అండర్ గ్రౌండ్‌లో పనిచేయకుండా ఇళ్లకు వెళ్లడం, మరికొందరు కార్మికులు తనకు తానుగా కోరి సర్ఫేస్‌లో పనులు చేసి అండర్ గ్రౌండ్ అలవెన్స్ పొందారనే విమర్శలున్నాయి. అలాంటి కార్మిక సంఘాల నాయకులు, ఇష్టపూర్వకంగా సర్ఫేస్‌లో పనిచేసిన కార్మికుల నుంచి అలవెన్స్ రికవరీ చేయడంలో అర్థముంది. కానీ అందరికీ వర్తింప చేయడం సరైంది కాదనే వాదన కార్మికుల నుంచి వ్యక్తమవుతోంది. ఈ విషయమై శాంతిఖని గని మేనేజర్ సంజయ్‌కుమార్‌సిన్హాను 'సాక్షి' వివరణ కోరగా నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నామన్నారు. సర్ఫేస్‌లో పనిచేసిన కార్మికులకు మాత్రమే అలవెన్స్ కోత విధిస్తున్నామని స్పష్టం చేశారు. కార్మికులకు అన్యాయం చేయాలనే ఉద్దేశం లేదన్నారు.

బయట పడింది ఇలా...

భూగర్భంలో దిగి పనులు చేయకుండా సర్ఫేస్‌లో విధులు నిర్వహించి నిబంధలకు విరుద్ధంగా అనేకమంది కార్మికులు అండర్ గ్రౌండ్ అలవెన్స్ పొందుతున్నట్లు సింగరేణి ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో బయట పడినట్లు తెలుస్తోంది. దీంతో గనుల వారీగా ఆడిట్ చేపట్టి లోగుట్టును రట్టు చేయడంతో ఇన్నాళ్లు సాగిన అండర్ గ్రౌండ్ అలవెన్స్‌ల వ్యవహారం వెలుగు చూసింది. అక్రమ పద్ధతిలో అలవెన్స్ పొందిన కార్మికుల గుట్టు రట్టయింది.



రికవరీ జాబితాలో ఉన్న శాంతిఖని కార్మికుల పేర్లు

108 అంబులెన్స్ తనిఖీ



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న అధికారి కిషోర్

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని 108 వాహనాన్ని సోమవారం రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిషోర్ తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని ప్రాథమిక వైద్య పరికరాలు, మెడికల్ కిట్లు, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి త్వరగా చేరుకుని బాధితులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అంబులెన్స్ వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని 108అంబులెన్స్‌ను ఆడిట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో అంబులెన్స్‌లోని పరికరాలు, రికార్డులు పరిశీలించారు. ఆడిటర్ కిషోర్ మాట్లాడుతూ రోగులకు అత్యవసరసేవలు అందించాలని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని అన్నారు. ఫోన్‌కాల్ రాగానే సంఘటన స్థలానికి చేరుకోవాలని, జాప్యంచేయవద్దని తెలిపారు. అనంతరం ప్రాథమిక వైద్యపరికరాలు, మందులు, మెడికల్ కిట్‌లనుతనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సామ్రాట్, పైలట్‌లు అనిల్, సత్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్యపై హత్యాయత్నం కేసులో భర్త రిమాండ్

కాసిపేట: భార్యపై హత్యాయత్నం కేసులో మండలంలోని కోమటిచేనుకు చెందిన వెంకటేష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. కోమటిచేను గ్రామంలో ఈ నెల 14న గెడం వసంత తన కొడుకుతో కలిసి రేకుల షెడ్డులో నిద్రిస్తుండగా.. తెల్లవారు జామున 3.30గంటల ప్రాంతంలో ఆమె భర్త వెంకటేష్ షెడ్డుపై డీజిల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. బెల్లంపల్లి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని, ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించామని వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని సర్దార్‌బస్తీకి చెందిన ఫారూఖ్‌ఖాన్ సోమవారం 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్సై అంజయ్య పాల్గొన్నారు.

చింతగూడ కోయవాగులో 15 క్వింటాళ్లు.. మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలో రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియా ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎండి తాజ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు.

ఇసుక తరలిస్తున్న జేసీబీ, లారీ పట్టివేత

భీమారం: జైపూర్ మండలం రసూల్‌పల్లి పెద్ద వాగు నుంచి ఇసుక తరలిస్తున్న జేసీబీ, లారీని పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. రసూల్‌పల్లి పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం రాత్రి వెళ్లి వాగు వద్ద లారీ, జేసీబీతో పాటు ట్రాక్టర్ కనిపించాయన్నారు. వాహనాలను జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

అనుమతులు లేకుండా మట్టి తరలింపు

వేమనపల్లి: మండలంలోని జిల్లెడ శివారులో ఐటీడీఏ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు ఎలాంటి అనుమతులు లేకుండా గుత్తేదారు ప్రాణహిత చేవెళ్ల ప్రధాన కాలువ నుంచి మట్టిని తరలిస్తున్నారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా ఆర్ఐ లక్ష్మణ్ రోడ్డు నిర్మాణ పనుల వద్దకు వెళ్లారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకున్నారు. అనుమతులు లేకుండా కాలువ మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు ఎలాంటి జరిమానా, కేసు కాకుండా కాంట్రాక్టర్ రాజకీయంగా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది.

టీపీఎఫ్‌జీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా మహేష్‌కుమార్



మహేష్‌కుమార్

బెల్లంపల్లి: తెలంగాణ ప్రొఫెషనల్స్ ఫిషరీస్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (టీపీఎఫ్‌జీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా బెల్లంపల్లికి చెందిన రామగిరి మహేష్‌కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిషరీస్ విభాగంలో సీనియర్ సైంటిస్ట్‌గా పని చేస్తున్నారు.

వలస బతుకుల్లో విషాదం

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి
- ప్రాణాపాయ స్థితిలో మరొకరు

వేమనపల్లి(బెల్లంపల్లి): పొట్ట కూటి కోసం వలస బాట పట్టిన ఆ కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఒకరు మృతి చెందగా మరొకరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆదివారం చెన్నూర్ మండలం కిష్టంపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమనపల్లి మండలం రాజారాం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. నాయిని గోవర్ధన్ (18) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుర్స సుమన్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. రెండు కుటుంబాలు రెండు నెలల క్రితం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న గుడిపేటకు వలస వెళ్లారు. ఇటుకబట్టీల వద్దనే గుడిసెలు వేసుకొని కాలం వెల్లదీస్తున్నారు. నాయిని సురేష్–సుగుణ దంపతుల ఒక్కాగానొక్క కుమారుడు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.



గోవర్ధన్(ఫైల్)

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి: బెల్లంపల్లి టీసీవోఏ క్లబ్‌లో ఈనెల 18న నిర్వహించిన రెండో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. 30 మంది బాలికలు పోటీల్లో పాల్గొనగా 21 బంగారు, 5 వెండి, 4 కాంస్య పతకాలు సాధించారు. విజేతలకు ఆదివారం రాత్రి బహుమతి ప్రదానం చేశారు. గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఎస్.రిషిత, జి.మనోజ్ఞ, బి.అక్షయ, ఎన్.సిరిచందన, కె.హాసిని, సింధూజ, నిత్యశ్రీ, జ్యోత్స్న, నిశిత, అవంతిక, శ్రావణి, రమ్య, కృష్ణవేణి, సత్యవతి, దుర్గాభవాని, వైష్ణవి, అన్విక, గాయత్రి, శ్వేత, సాయిలక్ష్మి ఉన్నారు. వెండి పతకాలు సాధించిన వారిలో సహస్ర, శ్రీవాణి, శృతి, హిమబిందు, వైష్ణవి ఉన్నారు. కాంస్య పతకాలు సాధించిన వారిలో సంజన, అభిజ్ఞ, హర్షిత, వైశాలి ఉన్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి డి.రజిత తెలిపారు. సదరు విద్యార్థినులను పీఈటీ భార్గవి, కరాటే కోచ్ స్నేహ అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థినులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి: బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) విద్యాలయంలో పదోతరగతి చదువుతున్న జంగంపల్లి ప్రణయ్ చరణ్ తెలంగాణ రాష్ట్ర జట్టుతో కలిసి సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు బీహార్‌లోని పాట్నాలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అల్లూరి వామన్, నడిగొట్టి రాకేష్ కుమార్, పి.శ్రీనివాస్, దత్తప్రసాద్, రాజేశ్వర్, గణపతి, శ్యాంసుందర్, రాజు, వరమని ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కరాటే పోటీల్లో ప్రతిభ

మంచిర్యాలటౌన్: చాంపియన్ కరాటే స్కూల్ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో ఈ నెల 18న బెల్లంపల్లిలో నిర్వహించిన రెండో నేషనల్ లెవల్ కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరాటే స్కూల్ నిర్వాహకులు తెలిపారు. రామగిరి సృజన్, రామగిరి స్నేహిత్, ఆరాధ్య, ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, తపస్వి, శివప్రియ, ఐశ్వర్య, స్పందన, అఖిల, నిత్య, శివాని, సంతోశి, అయాన్ష్ భరత్, కార్తీక్ ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. మాస్టర్‌లు అట్టె మధునయ్య, వి.రవి, స్వామి అభినందించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మేడారం భక్తులకోసం ఆర్టీసీ బస్సులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండు వద్ద సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నుంచి మేడారంకు ఆర్టీసీ 100 సర్వీసులను నడుపుతోందన్నారు. 24 గంటల పాటు నిరంతరం అందుబాటులో ఉంటాయన్నారు. గత జాతరకు 60 బస్సులను నడిపించగా ఈసారి అదనంగా 40 బస్సులను నడిపించడం సంతోషకరమన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సులోమోన్, డెప్యూటీ ఆర్‌ఎంలు ప్రవీణ్, ప్రణయ్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, నాయకులు చిలుముల శంకర్, నాతరి స్వామి, మల్లయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు సంగీత, సురేష్, రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.



బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్

శాలివాహన విద్యుత్ ప్లాంట్ తెరవాలి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాలలోని శాలివాహన విద్యుత్ ప్లాంట్‌ను బేషరతుగా తెరవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ సోమవారం విడుదల చేసిన లేఖలో డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోలు చేసిన కంపెనీలు బకాయిలు చెల్లించడం లేదని ప్లాంట్ యాజమాన్యం లాకౌట్ చేయడం వల్ల 120 మంది ఉపాధి కోల్పోగా దాదాపు 600ల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయారన్నారు. ప్లాంట్ నడిపే ప్రయత్నాలు మాని కంపెనీ స్థానంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని భావిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కార్మిక, ప్రజా సంఘాలతో పాటు ప్రతినిధులతో చర్చించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్లాంట్ ప్రారంభించేలా చూడాలని సూచించారు.

కదిలిన మున్సిపల్ అధికారులు

- స్వీట్‌హౌజ్ యజమానికి జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: 'పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. నాణ్యతలేని కేక్ విక్రయించినందుకు మహదేశ్ స్వీట్ హౌజ్ యాజమాని పవన్ లాల్‌కు రూ.10 వేల జరిమానా విధించినట్లు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని తినుబండారాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

- ఇప్పటికే 30 మందిని పైగా కరిచిన వైనం
- ప్రభుత్వ ఆస్పత్రిలో పెరుగుతున్న బాధితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తోంది. ఆది, సోమవారాల్లో పాతమంచిర్యాల, ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్‌లో 30 మందికి పైగా గాయపరిచింది. కాలనీవాసులు బృందాలుగా ఏర్పడి పిచ్చికుక్కను చంపేశారు. సోమవారం ఒక్కరోజే 18 మంది ఆస్పత్రిలో చేరినట్లు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి తెలిపారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలను తీసుకోక పోవడంపై ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల పట్టణంలో వీధికుక్కలు తరచూ ప్రజలను గాయపరుస్తుండడం, రోజురోజుకు బాధితుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఆస్పత్రిలో బాలింత మృతి



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట రాస్తారోకో

చెన్నూర్: చెన్నూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో బాలింత సోమవారం మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన, ప్రజాసంఘాలతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి బంధువుల తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా కార్సువెల్లి గ్రామానికి చెందిన రాపెల్లి రాజు భార్య మంగకు ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు రాగా చెన్నూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం ఉదయం మంగ ఆడశిశువుకు జన్మనిచ్చింది. పాప బరువు తక్కువగా ఉండడంతో పిల్లల ఆస్పత్రిలోని ఇన్‌క్యూబెటర్‌లో ఉంచారు. మంగ(26)కు తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని చెన్నూర్‌లోని ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని చెన్నూర్‌కు తీసుకొస్తుండగా పోలీసులు ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద అడ్డుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మృతదేహం కోసం బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్నారు.

ప్రజాసంఘాల మద్దతు

మృతురాలి బంధువులకు ప్రజాసంఘాల నాయకులు, బీఎస్పీ, బీఆర్‌ఎస్ నాయకులు గంగాభవాని, గోపినాథ్ మద్దతు తెలిపారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట రాస్తారోకో చేశారు. మంగ మృతికి కారకులను అరెస్టు చేసి ఆస్పత్రి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆస్పత్రిని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సందర్శించి ఆందోళనకారులతో మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, బాలింత మృతి విషయమై ఆస్పత్రి వైద్యురాలు అరుణశ్రీని సంప్రదించగా.. పాపకు జన్మించిన తర్వాత మధ్యాహ్నం 12గంటల వరకు బాగానే ఉందన్నారు. ఆ తర్వాత దమ్ము వస్తుందని సిస్టర్ చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించామని అన్నారు. పలమనరీ ఎడిమా ఉంటే హార్ట్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉంటాయని, గంట వ్యవధిలోనే మృతిచెందిందంటే, ఊపిరితిత్తులలో నీరు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారడం, గుండెపోటు వచ్చి చనిపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

ఇసుక రీచ్ ఎత్తివేయాలని ఆందోళన

నెన్నెల: మండలంలోని ఖర్జీ , జంగాల్‌పేట వాగులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ నుంచి బెల్లంపల్లికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. సాగు, తాగునీటి వనరులను దెబ్బతీసే ఇసుక రీచ్‌ను ఎత్తివేయాలంటూ ఆందోళన నిర్వహించారు. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రెండు పంటలు పండే ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి కేటాయించే సీనరేజీ నిధులు సైతం తమ గ్రామానికి రావడం లేదని, ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయించడం లేదన్నారు. 15 ఏళ్ల నుంచి మా గ్రామానికి బీటి రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడ్డామని, చివరికి రోడ్డు రావడంతో మా బాధలు తీరాయని అనుకుంటే అలాంటి రోడ్డు గుంతలమయం కావడంతో 108 అంబులెన్స్ సైతం గ్రామానికి రాని పరిస్థితి నెలకొందన్నారు. ఊరికి దగ్గరగా ఇసుక రీచ్ తీయడంతో వాగు కోతకు గురై ఇళ్ల పక్క నుంచి ప్రవహిస్తుందని వర్షం కురిసి వాగు ఉప్పొంగితే ఊరు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఆన్‌లైన్ అనుమతులు తొలగించి ఇసుక తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇసుక తరలించేందుకు వచ్చిన 300 ట్రాక్టర్లకు అడ్డంగా తిరిగి కదలకుండా 3 గంటల పాటు ఆందోళన చేపట్టారు. కూలీలు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, నెన్నెల ఎస్సై శ్యాంపటేల్‌తో సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పారు. మైనింగ్ అధికారులతో మాట్లాడి కలెక్టర్‌కు నివేదిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.



ఇసుక రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కొనసాగుతున్న సప్తాహ భజనలు

దండేపల్లి: తెలంగాణ అన్నవరంగా పిలువబడే దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సప్తాహ భజనలు కొనసాగాయి.



భజన చేస్తున్న సభ్యులు